బాధిత కుటుంబాలకు చల్మెడ పరామర్శ

రాజలింగంపేటలో గంగరాజు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు

మేడిపల్లి, ఫిబ్రవరి 7: భీమారం మండలం దేశాయిపేట గ్రామానికి చెందిన మేడిచలిమల రాజేశం వెన్నెపూస ఆపరేషన్ చేయించుకొని ఇంటికి రాగా, శుక్రవారం బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నాడు. కమ్మరిపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు వన్నెల దశగౌడ్ సోదరుడు ధర్మయ్యగౌడ్, పసునూర్‌లో బానోతు రాజు, రాజలింగంపేటకు చెందిన గుగ్గిళ్ల గంగరాజు ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబసభ్యులను బీఆర్ఎస్ నాయకుడు చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి, మాజీ సర్పంచులు సురేశ్, గాజోజి చారి, రాజిరెడ్డి, నాయకులు ప్రభాకర్, అజిత్‌రావు, అర్జున్, రాజేశ్వర్‌రెడ్డి, మకిలి దాస్, రాజేందర్, ఆదిరెడ్డి, సురేందర్‌రావు, లక్ష్మణ్, నరేందర్, రమేశ, కృష్ణ తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాల, ఫిబ్రవరి 7: జిల్లా కేంద్రంలోని పొలాస, గుల్లపేట, వ్యవసాయ కళాశాల, ఎక్స్‌ప్రెస్ ఫీడర్, పొరండ్ల, కన్నాపూర్, బాలపల్లి, కండ్లపల్లి, హనుమాజీపేట్‌కు శనివారం సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, రాంబజార్, పురాణిపేట, ఎల్‌జీ రాం లాడ్జీ ఏరియా, అంగడి బజార్, యావర్ రోడ్డు, మార్కెట్ బ్యాక్ సైడ్ ఏరియా, కృష్ణనగర్, అరవిందనగర్, మార్కండేయ టెంపుల్ ఏరియా, టాకాసంది, సాయిరాం నగర్, కరీంనగర్ రోడ్డు, గోవింద్‌పల్లి, గణేశ్ టెంపుల్ ఏరియా, బైపాస్ రోడ్డు, శ్రీరాం నగర్, వెంకటాద్రినగర్ ఏరియాలకు ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ రాజిరెడ్డి తెలిపారు. ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు హస్నాబాద్, లింగంపేటకు, మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు టీఆర్ నగర్, ధరూర్, నర్సింగాపూర్, వంజరిపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ అధికారులు పేర్కొన్నారు.

మారుతీనగర్/ఇబ్రహీంపట్నం/కొడిమ్యాల, ఫిబ్రవరి 7: మెట్‌పల్లి పట్టణంలోని టౌన్-1, 2 పరిధిలోని అన్ని వార్డులకు శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈలు మహేందర్, రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ సబ్‌స్టేషన్ పరిధిలోని కోమటికొండాపూర్, వర్షకొండ గ్రామాలకు శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ ప్రశాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు. కొడిమ్యాల సబ్ స్టేషన్ పరిధిలోని రామకిష్టాపూర్, చింతలపల్లి, కొడిమ్యాల, కొండాపూర్ గ్రామాలకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు.

భూసేకరణ త్వరగా పూర్తి చేయాలి

- నష్టపరిహారం అంచనాలు తయారు చేయాలి
- కలెక్టర్ సత్యప్రసాద్

కోరుట్ల: ఆర్డీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య ప్రసాద్

మెట్‌పల్లి, ఫిబ్రవరి 7: 63 జాతీయ రహదారి (బైపాస్) నిర్మాణం కోసం చేపట్టిన భూసేకరణ పనులను అధికారులు సమన్వయంతో త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. మెట్‌పల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో భూసేకరణలో భాగంగా కోల్పోతున్న వ్యవసాయ భూములు, ఇండ్లు, తదితర వాటికి సంబంధించిన రికార్డులను శుక్రవారం ఆయన పరిశీలించారు. రహదారి నిర్మాణంలో రైతులు, ప్రజలు ఇబ్బంది పడకుండా పనులు చేపట్టాలని, భూములు కోల్పోయిన రైతులు, ఇండ్ల యజమానులు ఏర్పాటు చేసుకున్న వసతులపై ప్రభుత్వం నష్టపరిహారం కింద చెల్లించాల్సిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కోల్పోతున్న వ్యవసాయ భూమి, ఇండ్లు, ఇతర కట్టడాలు, చెట్లు, బోర్లు, పైపులైన్లు తదితర నిర్మాణాలను పరిశీలించి నష్టపరిహారం అంచనా విలువను ఆయా శాఖల అధికారులు సమన్వయంతో నమోదు చేయాలని సూచించారు. ఇక్కడ మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, తదితరులున్నారు.

రోడ్డు పనుల పరిశీలన

కోరుట్ల, ఫిబ్రవరి 7: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయాన్ని కలెక్టర్ సత్యప్రసాద్ సందర్శించారు. ఈసందర్భంగా కోరుట్ల డివిజన్ పరిధిలో చేపడుతున్న నేషనల్ హైవే-63 పనుల పురోగతిపై ఆర్డీవో జీవాకర్‌రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రహదారి విస్తరణలో కోల్పోతున్న భూములు, ఇండ్ల వివరాల రికార్డులను పరిశీలించారు. భూసేకరణ పనులను అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇక్కడ తహసీల్దార్ కిషన్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

ఘనంగా వార్షిక స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా సంక్షేమాధికారి బోనగిరి నరేశ్

జగిత్యాల, ఫిబ్రవరి 7: జిల్లా కేంద్రంలోని జ్యోతి హైస్కూల్ విద్యార్థులకు స్థానిక గీతా విద్యాలయం క్రీడా ప్రాంగణంలో స్కూల్ ఒలింపిక్స్ పేరిట వార్షిక స్పోర్ట్ మీట్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఎలైట్స్, ఎక్స్‌పర్ట్స్, మాస్టర్స్, నోబెల్స్ గ్రూపుల విద్యార్థులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ పాఠశాల బ్యాండ్‌తో అతిథులకు గౌరవ వందనం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సంక్షేమాధికారి డాక్టర్ బోనగిరి నరేశ్ జాతీయ జెండా ఎగురవేయగా, పాఠశాల డైరెక్టర్ బియ్యాల హరిచరణ్ రావు స్పోర్ట్స్ జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా బోనగిరి నరేశ్ మాట్లాడుతూ, క్రీడలతో విద్యార్థులు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటారని పేర్కొన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన జ్యోతి హైస్కూల్ విద్యార్థులను అభినందించారు. హరిచరణ్ రావు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం వార్షిక స్పోర్ట్స్ మీట్ నిర్వహించి విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాల డైరెక్టర్లు శ్రీధర్ రావు, మౌనిక రావు, అజిత, రజిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి

పెగడపల్లి, ఫిబ్రవరి 7: పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీపై మండల వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, మండల వైద్యాధికారి నరేశ్ మాట్లాడుతూ, ఈనెల 10న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏడాది నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరికీ నివారణ మాత్రలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో మహేందర్‌రెడ్డి, నాయబ్ తహసీల్దార్ లాస్యశ్రీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభద్ర, వైద్య సిబ్బంది జయశీల, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మారుతీనగర్, ఫిబ్రవరి 7: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ఈనెల 10న ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. నులి పురుగులు చిన్నపిల్లల ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తాయని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేపై జిల్లాకు చెందిన పలువురు తమ అభిప్రాయాలు వెల్లడించారు. వారి మాటల్లోనే...

బీసీ రిజర్వేషన్లు దెబ్బ తీయాలని చూస్తున్నరు..

కులగణన సర్వే తప్పుల తడకగా ఉంది. బీసీల జనాభాను తక్కువగా, ఓసీల జనాభాను ఎక్కువగా చూపించారు. బీసీ రిజర్వేషన్లు దెబ్బతీయాలనే ఇలాంటి తప్పుడు లెక్కలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల జనాభా 52 శాతంగా ఉంది. ప్రస్తుతం కుల గణన ద్వారా 46 శాతానికి తగ్గినట్లు ప్రకటించారు. పదేండ్ల కింద జనాభా ఇప్పుడెలా..? తగ్గింతో ప్రభుత్వం సమాధానం చెప్పాలి. రిపోర్టుపై సమగ్ర విచారణ జరిపించి రీ సర్వే చేయాలి.

- అరికంటి సాగర్, బీఆర్ఎస్ బీసీ నాయకుడు, ఎఖీన్‌పూర్ (కోరుట్ల)

అణచివేయాలని చూస్తుంది

కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన పేరుతో బీసీలను అణచివేయాలని చూస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వంలో 2014లో చేపట్టిన సమగ్ర సర్వే వివరాల ప్రకారం బీసీల జనాభా 51శాతం, బీసీ ముస్లిం జనాభా 10శాతం మొత్తం 61శాతం పైనే ఉండాలి. కానీ కాంగ్రెస్ సర్కారు కుల గణన పేరుతో బీసీ జనాభా తగ్గించి కేవలం 46 శాతం ఉన్నట్లు చూపారు. దీనిపై అనేక అనుమానాలు ఉన్నాయి. ప్రభుత్వం వెంటనే రీ సర్వే చేయాలి. బీసీలకు న్యాయం చేయాలి.

- శీలం ప్రియాంక, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ (జగిత్యాలరూరల్)

తప్పులతడకగా కులగణన

కులగణన జరిగితే బీసీలకు న్యాయం జరుగుతుందనుకున్నం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తప్పులతడకగా నిర్వహించి, బీసీలు 46 శాతమే ఉన్నారని తేల్చడం అన్యాయం. ఓసీ జనాభా శాతం పెరిగిందని చెబుతున్న ప్రభుత్వం, బీసీ జనాభా తగ్గిందని కులగణనలో తేల్చడం అనుమానాలకు తావిస్తోంది. గతంలో అధిక శాతం ఉన్న బీసీలు ఇప్పుడు తగ్గారని చూపడమే కుల గణన సక్రమంగా జరగలేదనడానికి నిదర్శనం. ఇంతకుముందు బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు, ప్రస్తుతం కాంగ్రెస్ చేపట్టిన సర్వేకు చాలా వ్యత్యాసం ఉంది. గతంతో పోలిస్తే సుమారు 25 లక్షల మంది బీసీలను సర్వేలో చూపించకపోవడం కుట్రలో భాగమే. దీంతో రిజర్వేషన్లలో బీసీలకు అన్యాయం జరుగనుంది.

- పాలెపు రాజగంగారాం, మాజీ ఉపసర్పంచ్, రామలచ్చక్కపేట (మెట్‌పల్లి)

కుట్రపూరితంగానే తగ్గించి చూపారు..

కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన పేరుతో కుట్ర పూరితంగానే బీసీల జనాభా తగ్గించి చూపించింది. 2014లో సమగ్ర సర్వే వివరాల ప్రకారం రాష్ట్రంలో 1.85కోట్ల మంది బీసీలు ఉంటే ఇప్పటి సర్వేలో 1.64 కోట్ల మంది మాత్రమే ఉన్నారని చూపారు. కాలం గడుస్తున్న కొద్ది జనాభా పెరుగుతుందా..? తగ్గుతుందా..? నిప్రభుత్వం చెప్పాలి. ఆనాడు బీసీల జనాభా 51శాతం, బీసీ ముస్లిం జనాభా 10శాతం మొత్తం 61శాతం పైనే ఉండాలి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన పేరిట కావాలనే బీసీ జనాభా 46శాతం ఉన్నట్లు తగ్గించి చూపించారు. సర్వే సమగ్రంగా చేయలేదు. పూర్తిగా తప్పుల తడకగా ఉంది. సమగ్ర వివరాలతో కులగణన చేపట్టి స్పష్టమైన లెక్క చెప్పాలి.

- కొల్ముల రమణ, మాజీ జడ్పీటీసీ, నర్సింహులపల్లి (బీర్‌పూర్)

తప్పుల తడకగా బీసీల లెక్క

కులగణన సమగ్ర సర్వేకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన జాబితాలో బీసీ లెక్క తప్పుల తడగా ఉంది. 50 శాతానికి పైగా ఉన్న బీసీలను తగ్గించి చూపడం దారుణం. 30 లక్షల బీసీలను సమగ్ర సర్వేలో పరిగణలోకి తీసుకోలేదు. తక్షణమే బీసీలో కులాల వారీగా జనాభా వివరాలను వెల్లడించాలి. తప్పులను సవరించి పారదర్శకంగా మళ్లీ సర్వే చేయించాలి. కొన్ని వర్గాలను మెప్పించేందుకు, రాజకీయంగా ప్రయోజనం పొందేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన సమగ్ర సర్వేను అయోమయంగా చేపట్టింది. ప్రభుత్వ పునరాలోచించి బీసీలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- ఆకుల ప్రవీణ్, బీఆర్ఎస్ బీసీసెల్ నియోజకవర్గ నాయకుడు (మెట్‌పల్లి)

కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడి ఉండాలి

అసెంబ్లీ ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ హామీకి కట్టుబడి ఉండాలి. బీసీలపై సర్కారుకు ఏమాత్రం గౌరవం ఉన్నా ఇచ్చిన మాట ప్రకారం రిజర్వేషన్లను కేటాయించాలి. కులగణన సర్వేలో చాలా తప్పులు జరిగాయి. బీసీల జనాభా తగ్గించడం చూస్తే రాజకీయ కుట్ర కనిపిస్తున్నది.

- చిట్యాల లక్ష్మణ్, ముదిరాజ్ మహాసభ సంఘం మండలాధ్యక్షుడు (మల్లాపూర్)

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన

ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు ఏం చేయాలో అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం సభ్యులు

కొడిమ్యాల, ఫిబ్రవరి 7: ప్రజలు ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన కలిగి ఉండాలని ఎన్‌డీఆర్ఎఫ్ బృందం ఇన్‌స్పెక్టర్ ముఖేష్ కుమార్ సూచించారు. కొండగట్టులో భక్తులకు ప్రకృతి వైపరీత్యాలు, భూకంపం, వరదలు, అగ్ని ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు జరిగితే ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు సమయానికి రానప్పుడు ప్రాథమికంగా చేయాల్సిన చికిత్స, చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మునీందర్, ఎస్ఐలు నరేశ్, మతిలేష్, ఆలయ సూపరింటెండెంట్ సునీల్, హరినాథ్, ఆర్ఐ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల తనిఖీ

మల్లాపూర్, ఫిబ్రవరి 07: వాల్గొండ గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం డీఈఓ రాము ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి తెలుసుకోవడంతో పాటు పాఠశాల పరిసర ప్రాంతాలను సందర్శించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట మండల విద్యాధికారి దామోదర్ రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

వివాహితను కాపాడిన పోలీసులు

సారంగాపూర్, ఫిబ్రవరి 7: మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన ఓ వివాహిత శుక్రవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంటున్నట్లు డయల్ 100కు సమాచారం ఇచ్చారు. స్పందించిన హెడ్‌కానిస్టేబల్ అహ్మద్, పీసీ రవిలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఇంటి తలుపులు పగులగొట్టి వివాహితను ఆత్మహత్య చేసుకోకుండా కాపాడారు. ఈ సందర్భంగా పలువురు పోలీసులను అభినందించారు.

ఉచిత వైద్య శిబిరం

రాయికల్, ఫిబ్రవరి 7: రాయికల్ పట్టణంలోని గౌడ సంఘ భవనంలో కరీంనగర్ మెడికవర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యుడు విష్ణు 150 మందిని పరీక్షించి, వివిధ వ్యాధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, శ్రీకాంత్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొడిమ్యాల, ఫిబ్రవరి 7: మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన పొనగంటి అంజయ్య ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని శుక్రవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. అంతకు ముందు మల్యాల మండలంలో పలు వివాహ వేడుకలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట నాయకులు దొంగ ఆనంద రెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, ముత్యం శంకర్ గౌడ్, దారం ఆదిరెడ్డి, శనిగరపు తిరుపతి, మేక లక్ష్మణ్, ప్రకాశ్ రెడ్డి, చంద్రశేఖర్, నక్క అనిల్, మిలిటరి శ్రీను, మల్లేశం, అంజయ్య, వంశీ, రవి, సంజీవ్, పోచయ్య, అనీల్, వినయ్, కిషన్ రెడ్డి, వెంకటేశ్, తదితరులున్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

కోరుట్ల, ఫిబ్రవరి 7: ప్రతి ఒక్కరూ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి కోరారు. పట్టణంలో శుక్రవారం మున్సిపల్ ఆధ్వర్యంలో డ్రైడే నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలోని పలు వార్డులను పరిశీలించారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇక్కడ వార్డు అధికారులు, మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

అధ్యాపకుల ప్రచారం

సారంగాపూర్, ఫిబ్రవరి 7: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అధ్యాపకులు శుక్రవారం రేచపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లారు. పదో తరగతి విద్యార్థులతో సమావేశమై కళాశాలలో కోర్సులు, వసతులు వివరించారు. కళాశాలలో చేరాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్, అధ్యాపకులు శ్రీధర్, రాజు, రాజేందర్, రాజ్‌కుమార్, రజిత, నాగేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ, కుల గణన చారిత్రాత్మకం

ధర్మపురి, ఫిబ్రవరి 7: ఎస్సీ వర్గీకరణ, కులగణన చేపట్టడం చారిత్రాత్మకమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద అంబేద్కర్ విగ్రహాన్ని శుక్రవారం ఆయన పూలతో అలంకరించారు. అనంతరం బ్రాహ్మణ సంఘ భవనంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు సంగనబట్ల దినేశ్, బాదినేని రాజేశ్, సుభాష్, చిలుముల లక్ష్మణ్, వేముల రాజేశ్, చీపిరిశెట్టి రాజేశ్, సుముఖ్ తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ భవనం లీజుపై విచారణ చేపట్టాలి

మెట్‌పల్లి, ఫిబ్రవరి 7: మెట్‌పల్లి కొత్త బస్టాండ్ సమీపంలోని డీసీఎంఎస్ స్థలంలో కొత్తగా నిర్మిస్తున్న భవనాన్ని లీజుకు ఇవ్వడంలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని జిల్లా సహకార విభాగం అధికారికి శుక్రవారం వినతి పత్రం అందజేసినట్లు మెట్‌పల్లి విశాల వ్యవసాయ సహకార సంఘం మాజీ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి తెలిపారు. పాత షెడ్డును తొలగించి, అదే స్థలంలో కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారని, భవనం లీజుకు సంబంధించి ఎలాంటి ప్రకటనలు జారీ చేయకుండా, టెండర్లు పిలవకుండా లోపాయికారి ఒప్పందంతో సంబంధిత డీసీఎంఎస్ అధికారులు కొందరు తక్కువ ధరకు ఓ వ్యాపారికి లీజుకు కట్టబెట్టారని ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

పసుపు క్వింటాల్ @ రూ.11,555

మెట్‌పల్లి, ఫిబ్రవరి 7: మెట్‌పలి వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం పసుపు కాడి (కొమ్ము) క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.11,555, కనిష్ఠ ధర రూ.6,002 పలికింది. పసుపు గోళ (మండ)కు గరిష్ఠ ధర రూ.9,566, కనిష్ఠ ధర రూ.5,556, పసుపు చూర క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ. 10,211, కనిష్ఠ ధర రూ.5,500 పలికినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు మార్కెట్‌లో 1234 క్వింటాళ్ల పసుపు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యార్థి ప్రతిభ

విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేస్తున్న నిర్వాహకులు

కోరుట్ల, ఫిబ్రవరి 7: పట్టణంలోని రైజింగ్ హైస్కూల్ విద్యార్థిని శ్రీహర్ష రెడ్డి జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో ప్రతిభ కనబర్చింది. ఇటీవల విశ్వం ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో 3వ ర్యాంకు సాధించింది. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో శ్రీహర్షరెడ్డికి నిర్వాహకులు ప్రశంస పత్రం, మెమోంటో అందజేశారు. ప్రతిభ చూపిన విద్యార్థిని పాఠశాల కరస్పాండెంట్ కుడేల రాజేంద్ర ప్రసాద్, ప్రిన్సిపాల్ లిఖిత, డైరెక్టర్లు షహనాజ్ బేగం, చిప్ప మోహన్, అబాకస్ శిక్షకురాలు వెన్నెల, అధ్యాపకులు, అభినందించారు.

వ్యాసరచన పోటీలు

కథలాపూర్, ఫిబ్రవరి 7: మండల కేంద్రంతోపాటు దుంపేట ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం జంతు సంక్షేమంపై జంతు సంక్షేమ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి దివ్యశ్రీ, ఉపాధ్యాయులు సతీశ్, రాజ్‌కిరణ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

విద్యార్థికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

జగిత్యాల, ఫిబ్రవరి 7: పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) పూర్వ విద్యార్థి మెట్‌పల్లి మండలం రామలచ్చక్కపేటలోని ఏఎస్సార్ తండాకు చెందిన గుగ్లావత్ రాజమణి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో ప్రతిభ చూపి అసిస్టెంట్ మేనేజర్ ఉద్యోగం సాధించింది. రాజమణిని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ అభినందించి, భవిష్యత్‌లో ఇంకా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ ప్రమోద్‌కుమార్, చంద్రయ్య, వరప్రసాద్, సంగీతారాణి పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి

జగిత్యాల, ఫిబ్రవరి 7 : జిల్లాలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు గానూ మరో రూ.18.74 కోట్లు విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి కోరారు. ఈ మేరకు జీవన్ రెడ్డి శుక్రవారం సీఎంకు లేఖ రాశారు. జిల్లాలో 517 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద రూ.44.51 కోట్ల విలువైన పనులు మంజూరు కాగా, ఇప్పటికే రూ. 51.46 కోట్ల విలువైన పనులు మహిళా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టినట్లు తెలిపారు.

రమాబాయి అంబేద్కర్‌కు నివాళి

రమాబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కోరుట్ల, ఫిబ్రవరి 7: పట్టణంలోని కొత్త బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం రమాబాయి అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు బలిజ రాజరెడ్డి, ఉయ్యాల నర్సయ్య, గోరుమంతుల నారాయణ, లక్ష్మణ్, సంతోష్‌కుమార్, సత్తయ్య, వేణుగోపాల్, రాములు, దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

మారుతీనగర్, ఫిబ్రవరి 7: మెట్‌పల్లి పట్టణంలోని చావిడి వద్ద గల ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు సైనిక ఫౌండేషన్ సభ్యుడు బాస చంద్రశేఖర్ పుట్టిన రోజు సందర్భంగా పరీక్షా సామగ్రిని శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నంబి రాజేందర్‌శర్మ, ఫౌండేషన్ సభ్యులు అరిగెల రాకేశ్, జనార్దన్, శ్రావణ్, హరీశ్, చిరు, వినోద్ తదితరులున్నారు.

వివాహిత అదృశ్యం

ధర్మపురి, ఫిబ్రవరి 7: ధర్మపురికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైనట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా దండెపల్లి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన సతీశ్-లావణ్య దంపతులు కొంతకాలంగా ధర్మపురిలో నివాసం ఉంటున్నారు. వీరికి 15 ఏళ్ల క్రితం వివాహం కాగా ఇద్దరు పిల్లలున్నారు. లావణ్య ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో స్వీపర్‌గా పనిచేస్తున్నది. అయితే, గురువారం ఉదయం దేవస్థానంలో డ్యూటీ చేయడానికి వెళ్లింది. సాయంత్రం 5 గంటలు దాటినా ఇంటికి రాకపోవడంతో సతీశ్ బంధువుల ఇండ్లల్లో ఆరా తీసినా ఆచూకీ దొరకలేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



గొర్రెకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి మనీషా పటేల్

వ్యాధి నివారణ టీకాలు

మారుతీనగర్, ఫిబ్రవరి 7: మండలంలోని వెల్లుల్ల గ్రామంలో మూగజీవాలకు మండల పశువైద్యాధికారి మనీషా పటేల్ శుక్రవారం వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఇక్కడ పశువైద్య సిబ్బంది రమణయ్య, పశుపోషకులు, తదితరులున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

జ్యోతినగర్, ఫిబ్రవరి 7: సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎన్టీపీసీలోని మూడో డివిజన్ న్యూపోరట్‌పల్లికి చెందిన మెరుగు లింగమూర్తి(48), ముష్కే బినేశ్ (28) మృతిచెందగా, మెరుగు మహేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. ఎన్టీపీసీ న్యూపోరట్‌పల్లికి చెందిన మెరుగు లింగమూర్తి, అతని సోదరుడు మెరుగు మహేశ్, మేనల్లుడు బినేశ్ గురువారం రాత్రి స్విఫ్ట్ డిజైర్ కారులో హైదరాబాద్‌కు బయలుదేరారు. గజ్వేల్ రాజీవ్ రహదారి వద్ద శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో రోడ్డుపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో లింగమూర్తి, అతని అల్లుడు బినేశ్ అక్కడికక్కడే మృతిచెందారు. లింగమూర్తి సోదరుడు మహేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. పరిస్థితి విషమం గా ఉండడంతో 108 సిబ్బంది గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అనంతరం అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. కారు డ్రైవర్ ప్రణయ్ సాగర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సాయంత్రం మృతదేహాలు ఇంటికి రాగా, న్యూపోరట్‌పల్లిలో విషాద చాయలు అలుముకున్నాయి.

మంథనిలో ఇంటర్ విద్యార్థి

మంథని, ఫిబ్రవరి 7: బోలెరో, ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఇంటర్ విద్యార్థి మృతి చెందిన సంఘటన శుక్రవారం మంథనిలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మంథని మున్సిపల్ పరిధిలోని బోయినిపేటకు చెందిన మిర్యాల స్వరూప-రాజు దంపతుల కుమారుడు హర్షవర్ధన్ (17) ముత్తారం మండలం దర్యాపూర్ మోడల్ స్కూల్‌లో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. హర్షవర్ధన్ బైక్‌పై గంగాపురి నుంచి మంథని వైపు వస్తుండగా రైస్ మిల్ సమీపంలో బోలెరో వాహనం ఢీకొట్టింది. దీంతో వెనుక నుంచి వస్తున్న ట్రాక్టర్‌కు హర్షవర్ధన్ తల తగిలి కింద పడి పోయాడు. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది క్షతగాత్రుడిని మంథని ప్రభుత్వ దవాఖానకు తీసుకు రాగా వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. హర్షవర్ధన్ కుటుంబ సభ్యులం తా ఓ శుభకార్యం కోసం కరీంనగర్ వెళ్లగా విషయం తెలియడంతో హుటాహుటిన వెనుతిరిగారు. స్వరూప-రాజు దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు. కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారు రోదించిన తీరు అందరినీ ఎంతగానో కలిచి వేసింది. కాగా, ప్రమాదానికి కారణమైన బొలెరో, ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్ తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.